# గతి

మహీధర రామశాస్త్రి



**వెన్నెట్లో కోనసీమ కొబ్బరిచెట్లు వెండి గొడుగుల్లా మెరుస్తున్నాయి. ఆ కొబ్బరి చెట్ల నీడల్లో ప్రశాంతంగా, ఆహ్లాదంగా వుంది వూరు!**

ఆ ప్రశాంత వాతావరణంలో అపశ్రుతిలా వెంకటప్పయ్య వెర్రిగా అరుస్తున్నాడు. అతని అరుపులు చికాకుని కలిగిస్తున్నాయి.

అంతలోనే —

''చచ్చిపోయాన్రోయ్! కొట్టి చంపెయ్యకు రోయ్!'' అంటూ ఏడుపు.

ఆ గొంతు వెంకటప్పయ్య ముసలితల్లి ప్రభావతమ్మది. మొగుడు బతికున్న రోజుల్లో ప్రభావతమ్మ జీవితంలో ఓ ప్రభ వెలిగింది. మొగుడు పోయి, భోగభాగ్యాలు పోయి అన్నీపోయి, చివరికి యీ దోసెడు కొంప, మతిలేని కొడుకు, కోడలుతో చివరి రోజులు వెళ్లమారుస్తోంది ప్రభావతమ్మ!

ఉపవాసాలు చెయ్యలేక, చావుదెబ్బలు పడలేక, యీసరికి ఆ గుక్కెడు ప్రాణం పోయివుండాల్సిందే! కాని, ఆమె రక్తంలో జీర్ణించుకుపోయిన ఓ కోరిక ప్రభావతమ్మ ప్రాణాన్ని నిలబెట్టుకుంటూ వస్తోంది!

ఏవిటా కోరిక?

కాశీ వెళ్లిరావాలని!

* * *

''అమ్మా! ఆకలే! అన్నం పెట్టవే!'' అని దీర్ఘాలు తీస్తున్న ప్రభావతికి తల్లి నచ్చచెప్తోంది.

''ఉండమ్మా! మగవాళ్ల భోజనాలు అయిపోతున్నాయి! మీ నాన్నగారు వచ్చేక మనం వెడదాం! సోవప్పగారింట యీవేళ కాశీ సంతర్పణ కదా! కాస్త ఆలశ్యం అయినా ఓర్చుకోవాలి మరి!''

''కాశీ సంతర్పణం అంటే ఏవిటే?''

''అంటే — కాశీ వెళ్లివచ్చినవాళ్లు ఊరంతా భోజనాలకి పిలిచి సంతర్పణ చేస్తారు! మనవంతా వాళ్లింట్లో భోజనాలు చేస్తాం!''

''అమ్మబాబోయ్! ఊరంతానా?''

''ఆ! వూరంతా!''

''మన వూళ్లో ఎంతమంది జనం వున్నారో అంతమందికీ భోజనం పెడతారా?''

''ఆ! అంతమందికీ!''

''మన చాకలి సోమాలూ వస్తుందా?''

''అది రాదు! దానికి యింటికి యిస్తారు. పట్టుకుపోయి తింటుంది!''

''మనకి బండి కట్టే వెంకన్న వస్తాడా?''

''బాగుందే! నీ ప్రశ్నలూ నువ్వూనూ! వాళ్లంతా ఎందుకు? వాళ్లని పిలవరు!''

''మరి వూరంతా అన్నావ్?''

''ఊరంతా అంటే, మన బ్రాహ్మలంతాను!''

ప్రభావతి పట్టుపరికిణీ కట్టుకుని, తల్లితో భోజనానికి వెళ్లింది --

అక్కడ —

మంగళ వాయిద్యాలు మోగుతున్నాయి. సోవప్పగారూ, భార్యా పట్టుబట్టల్లో మెరిసిపోతున్నారు. భోజనాలు బాగున్నాయి. అదో పెళ్లిలా కనిపించింది చిన్న ప్రభావతికి.

తాంబూలం తీసుకుని వస్తున్న తల్లికొంగు పట్టుకుని, ఇంటికి వస్తూ — ''అమ్మా మనం ఎప్పుడు వెడదామే కాశీ?'' అని అడిగింది ప్రభావతి.

''బాగుందమ్మా నీ ప్రశ్న! దగ్గరా దాపులా? దానికి బోలెడు డబ్బు కావాలి. అంతకు మించి ఒంటిమీద ఆ యోగం వుండాలి. కాశీ అంటే మాటలా? మూటలు పట్టుకుంటే అవుతుంది! పెళ్లయి పెద్దదానివయితే, నీ మొగుడూ నువ్వూ వెడుదురుగాని కాశీ!'' అందా తల్లి.

ప్రభావతి పెళ్లికోసం ఎదురు చూసింది.

* * *

ఎదురు చూడగా చూడగా, ప్రభావతికి పెళ్లి అయింది. మంచి సాంప్రదాయ కుటుంబవనీ, ఆస్తిపాస్తులున్న వాళ్లనీ, తన మావగారు మూడుసార్లు కాశీ నడిచి వెళ్లి వచ్చాడనీ, అంతా గొప్పగా చెప్పుకుంటూంటే — ప్రభావతి ఎంతో గర్వపడింది! అంతకన్నా ఎక్కువ సంతోషపడింది — కనీసం తన భర్త ఒక్కసారన్నా కాశీ వెళ్లడా? వెడుతూ తననూ తీసుకువెళ్లడా అని!

ఔపోసన నాటిరాత్రి భర్త తనని దగ్గరగా తీసుకుని, ముద్దుపెట్టుకుని సిగ్గును వదిలించాక, మొదటిసారిగా తన కోరికను భర్తకు చెప్పుకుంది.

''ఏవండీ! మనం కాశీ ఎప్పుడు వెడదావండీ?''

''అదేవిటే? పిచ్చిదానా! కాపురానికయినా రాలేదు! కార్యం నాటిరాత్రే కాశీ అంటావేవిటి? ఎన్ని కథలూ; కార్యాలూ అవాలి? కాటికిపోయే ముందు కాశీ వెళ్లొద్దాంలే! అంతవరకూ పిచ్చిపిచ్చిగా వాక్కు! దా! నా దగ్గరగా కూర్చో! నే చెప్పే కథలన్నీ విను! నేను చెయ్యమన్నట్టల్లా చెయ్యి!'' అంటూ ప్రభావతి చేతిని తన చేతుల్లోకి తీసుకుని, ఎక్కడెక్కడికో తీసుకువెళ్లాడు భర్త.

ప్రభావతి ప్రభావతమ్మ అయింది. ప్రభావతమ్మ భర్త చెప్పే కథలన్నీ వింది. చెయ్యమన్నట్టల్లా చేసింది. రత్నాల్లాంటి ఆరుగురు ఆడపిల్లల్నీ ముత్యాల్లాంటి ముగ్గురు మగపిల్లల్నీ కంది. సంసారం నడపడానికి, ఆడపిల్లల పెళ్లిళ్లు చెయ్యడానికి, తన ఒంటిమీద నగా నట్రా ఒల్చుకుపోయి, ఆఖరికి ఓ నాడు — ''ఈ సంతతే నీ సంపద!'' అని వప్పజెప్పి తను కాటికిపోయాడు! కాశీకి తీసుకువెళ్లలేదని ఏడ్చింది ప్రభావతమ్మ.

అలా ఏడుస్తూనే వుంది అప్పట్నుంచి. చిన్న కొడుకులిద్దరూ ఉద్యోగాలు వెతుక్కుంటూ రెక్కలు కట్టుకుపోయారు. వెంకటప్పయ్య దగ్గర ప్రభావతమ్మ రోజులు గడుపుకుంటూంది. ఆవిడ ఆశ ఏవిటి? ఎప్పుడో ఓ రోజున చిన్నకొడుకు దొరబాబులా వచ్చి తనను కాశీకి తీసుకువెడతాడని!

ఆ మాట ఏమోగాని, వెంకటప్పయ్య మాత్రం వెన్నుపూస విరిగేలా తన్నుతూంటాడు. కోడలు పట్టకారు పెట్టి తొడపాయసాలు పెడుతూవుంటుంది. అట్లకాడతో గోళ్లూడకొడుతూ వుంటుంది. ఎవరూ పట్టించుకోరు. పట్టించుకోనూలేరు!

* * *

వెంకటప్పయ్య పిచ్చాడు కాదు! పిల్లల్ని కొటున్నాడు – పిల్లలకి పాఠాలు చెపుతున్నాడు; టీచరుగా పనిచేస్తున్నాడు. అయితే – మనిషి [illegible] కొంత తిక్క, మరికొంత పెంకితనం లేకపోలేదు.

ఓమారు సెంటర్ క్లాస్‌లో పాఠం చెప్పాల్సిన వంతు వెంకటప్పయ్యమీద పడింది. వచ్చిన అధికారి స్త్రీ!

''అంగన నమ్మరాదు!'' అన్న పద్యం చెప్పి అర్థ తాత్పర్యాలు చెప్పడం మొదలుపెట్టాడు!

ఆ అధికారిణి మండిపోయి, ''మగవారిని

నమ్మవచ్చా మేస్టారూ ?'' అని అడిగింది. ఆ తర్వాత వెంకటప్పయ్యకి శంకరగిరికి బదిలీ జరిగింది ! వాళ్ల కడుపులూ వీళ్ల కాళ్లూ పట్టుకుని ఏడిస్తే — ఏడాదికిగాని మళ్లా గోదావరి, కొబ్బరిచెట్లూ దర్శనం కాలేదు !

మరోమారు —

బి. డి. వో ఆఫీసుకి వెళ్లి —

''జనరల్ ఫండులో ఖర్చు రాసుకుని నాకో రెండు వేలు అప్పు యివ్వండి ! నేను ఆర్థికంగా వెనకబడ్డవాణ్ణి ! కాదంటే ఇందిరమ్మకి రాస్తా !'' అన్నాడు.

''రాసుకో ! ఫో !'' అన్నాడు బిడివో.

అంతకన్న మరే చురక తగిలించకపోవడానికి కారణం — తనదగ్గర పనిచేస్తున్న హెడ్డుగుమాస్తా శంభుప్రసాద్‌కి వెంకటప్పయ్య అల్లుడు కావడమే కారణం.

''నాకీ వెధవ ఉద్యోగం అక్కర్లేదు !'' అని రిజైన్ కాగితం బిడివో ముఖాన కొట్టినా —

''నా కూతురూ పిల్లలూ నాశనం అయిపోతారు !'' అని శంభుప్రసాద్ బిడివోకి మొర పెట్టుకోబట్టి ఉద్యోగం నిలబడిన్నంది.

భార్యను చావగొట్టి యింట్లోంచి గెంటేస్తాడు వెంకటప్పయ్య. మూడునాళ్ల తర్వాత పిల్లల్ని వెంటబెట్టుకుని మళ్లా వచ్చేస్తుంది. ఇద్దరికీ పడదు; షష్ఠాష్టకం పోరు.

''ఈ పీనుక్కి యీ పైత్యం ఎప్పుడు తగ్గుతుందిరా భగవంతుడా !'' రాగాలు తీస్తూ ఆలోచిస్తుంది ప్రభావతమ్మ అరుగుమీద కూర్చుని.

మళ్లా యివతలకు వచ్చాడు వెంకటప్పయ్య.

''ఫో ! నా అరుగుమీంచి ఫో ! నా యింట్లో ఉండద్దు !'' అంటూ కాలితో తన్నేస్తున్నాడు.

''ఎక్కడికి పోతా నా యీ అర్ధరాత్రి ? నువ్వు చచ్చిపోనూ ! నీ అమ్మ కడుపు కాలా !''

ప్రభావతమ్మ తిట్టిపోస్తూంది.

''అవును ! నేను చచ్చిపోయినట్టే నీకు ! ఫో ! బయటకి ఫో !'' అంటూ ఆ ముసలి ప్రాణం రెక్క పట్టుకుని వీధిలో నడిపిస్తున్నాడు.

అందరూ వినోదంలా చూస్తున్నారే తప్ప ఒక్కళ్ళూ నోరు మెదపడం లేదు — నాలుగురోజుల క్రిందటి సంగతి గుర్తుకు వచ్చాక.

భార్య కాఫీతెచ్చి ఇచ్చిందిట. నువ్వు తాగేవా ? అని అడిగాట్ట. నా కప్పు లోపలుంది. మీరు తాగండి ! ఇది మీకు ! అందిట. ఆ కప్పు యిలాతే ! నేనది తాగుతా ! ఇది నువ్వు తాగు ! అన్నాట్ట ! అబ్బే ! వద్దు ! అందిట భార్య. పోనీ ఇందులోంచి రెండు గుక్కలు తాగి ఇయ్యి ! అన్నాట్ట. మీది మీరు తాగండి ! నాది నేను తాగుతా ! అందిట భార్య.

అలా వెడుతున్న కుక్కను పిల్చి తన కాఫీ తాగించాట్ట ! ఆ కుక్క అసింటా వెళ్లి కక్కుకుందిట ! అంతే !

''వెధవా ! నన్ను చంపేద్దామని చూస్తున్నావా ?'' అని జుట్టు పట్టుకుని గుంజి నడ్డిమీద తన్నుతూంటే—చూడలేక, వెంకట్రావయ్యగారు కలుగజేసుకుని బుద్ధి చెప్పబోయారట.

అంతవాణ్ణి పట్టుకుని—''లంజకొడకా ! నువ్వు

# గతి

అడ్డువస్తే నిన్ను చంపేస్తా !'' అంటూ కత్తి తీసుకు వచ్చాట్ట !

ఇది నాలుగురోజుల క్రిందటి భాగోతం.

ఇంక ఎవరు కలుగజేసుకుంటారు ? ఎవరికి కావాలి ?

జానకమ్మగారు మాత్రం చూస్తూవూరుకోలేక ప్రభావతమ్మను తన ఇంట్లోకి తీసుకువెళ్లింది. ఆ రాత్రికి తన ఇంట పడుకోబెట్టుకుంది.

తెల్లగా తెల్లవారింది.

ప్రభావతమ్మ మామూలుగా ఏవీ కానట్టే తన ఇంటికి వెళ్లిపోయింది. వెంకటప్పయ్య కూడా ఏవీ అనలేదు. ప్రశాంత వాతావరణం ఏర్పడింది.

* * *

మళ్లా ఓనాడు గావుకేకలు; పెడబొబ్బలు, ఏడుపులు! ముక్కు చీదుకుంటూ ప్రభావతమ్మ వీధినపడింది. ఈసారి వీధినపోయే ప్రతీవాడిని ఆపి, పితూరీ చేసింది; కోడలు తనకి అన్నం పెట్టడం లేదని !

ఈసారి కలగజేసుకున్నారు జనం ! అవును మరి; రేపటినుంచి అందరి ఇళ్లమీదా పడుతుంది— 'అది కావాలి; యిది కావాలి' అంటూ.


త్వరలో

నర్సింగ్ హోం

సీరియల్


ఫలితంగా—ప్రభావతమ్మ ఆ ఇంట్లోనే వీధి గదిలో వేరేగా వుంటూ, వండుకుతినడం, వెంకటప్పయ్య రసవర్గాలు యివ్వడం — ఇలా వప్పందం కుదిరింది ! పెద్దముండ కదాని జాలిచేత ఆవిడకి ఆ వున్న ఒక్క కిరసనాయిలు స్టవూ ఇప్పించారు. తడికమ్మలు, డొక్కలతో ఎక్కడ కుస్తీ పడుతుంది మరి ?!

ఓ రోజు కిరసనాయిలు అయిపోయింది. లీటరు అయిదూ, ఆరూ యిచ్చినా దొరకడంలేదు ! నా మాట ఏవిటంది ప్రభావతమ్మ.

''నాకేం తెలీదు ! చావు !'' అన్నాడు వెంకటప్పయ్య ! ఎక్కడికిపోయి ఛస్తుంది ? చచ్చినా దొరకడం లేదు కిరసనాయిలు !

''పోనీ రెండు కమ్మలయినా తగిలెయ్యి !'' అని బతిమాలింది ప్రభావతమ్మ.

''మాటంటే మాటే ! కమ్మలు డొక్కలు ముట్టుకుంటే డొక్కలో తన్నేస్తా ! డబ్బులు డబ్బా పట్టుకుని లైనులో నిలబడు ! కిరసనాయిలు రేషను షాపునుంచి తెచ్చుకో ! ఫో !'' అన్నాడు వెంకటప్పయ్య.

అక్కడా కిరసనాయిలు దొరక్కపోగా —

ఆ డబ్బులు పెట్టి హోటల్లో ఇడ్లెన్ను కొనుక్కుని తినడం మొదలుపెట్టింది, ప్రభావతమ్మ.

హోటలువాడి కారంపచ్చడి, అల్లంపచ్చడి, కారప్పొడి పడక, కడుపు పాడయింది. అజీర్తిరోగం పట్టుకుంది ప్రభావతమ్మకి. చెంబు నేలమీద పెట్టడంలేదు. ఎప్పుడూ చేతిలోనే వుంటూంది ! ఎప్పుడూ ఏటి పల్లంలోనే కూర్చుంటూంది !

వెంకటప్పయ్య మాటమీద నిలబడే మనిషి కాబట్టి ఇవేమీ పట్టించుకోలేదు ! పైగా —

''హైదరాబాదో, ఢిల్లీయో ఫో! కిరసనాయిలు దొరక్క అన్నంలేక మాడి ఛస్తున్నా అని చెప్పుకో ! ఫో !'' అని సలహా యిచ్చాడు.

కూర్చుంటే లేవలేకపోతున్న, అన్నం లేక హైరానపడిపోతున్న ప్రభావతమ్మ హైదరాబాదు ఏం వెడుతుంది ?!

* * *

భళ్లున తెల్లవారలేదింకా; వెంకటప్పయ్య భార్య గొల్లుమంది ! ఆ గోలలో అత్తగారి గుణవర్ణన కొనసాగుతూంటే, యిరుగూ పొరుగూ ఓ చెవి అటు పారేశారు. తెలిసిందేవిటయ్యా అంటే —

ప్రభావతమ్మ గో హైట్ !

ప్రభావతమ్మ బాల్చి తన్నేసిందని !

వెంకటప్పయ్య తల్లి కోసం వెర్రిగా యేడ్చాడు.

దహనం అయింది కానీ దొరబాబుల్లాంటి యిద్దరు చిన్న కొడుకులు రాలేదు !

''మొత్తం కర్మ అంతా మీరెందుకు చెయ్యాలి ?'' అని వెంకటప్పయ్య భార్య నెత్తి మొత్తుకుని నచ్చజెప్పినా వెంకటప్పయ్యే వినిపించుకోలేదు !

ఏ మాటకామాటే చెప్పుకోవాలి !

కర్మ చాలా భారీగా చేశాడు !

గోదానానికి జెర్సీ ఆవుని కొన్నాడు. సువర్ణ దానానికి వేలినున్న వుంగరం యిచ్చేశాడు. పాతర సామాను అమ్మాల్సివచ్చినా వెనుకాడలేదు - వూరంతా సంతర్పణ చేసాడు తల్లి శ్రాద్ధానికి !

పాపం — వెంకటప్పయ్య భార్య —

''రేపటినుంచి మన గతి యేవిటండీ ?'' అని అడుగుతూనే వుంది.

''ఆవిడ ఉత్తరగతుల మాటేవిటి ?'' టస్సాయించి అడిగేడు వెంకటప్పయ్య.

పన్నెండో రోజు అయిపోయాక —

ఓనాడు వెంకటప్పయ్య చాకింటెబట్టలు సర్దుకుంటున్నాడు. బెడ్డింగులా బొంతల్నీ, దుప్పట్లనీ ముట్టుకుంటున్నాడు. తెగ హడావుడి పడిపోతున్నాడు ప్రయాణ సన్నాహంతో !

''ఎక్కడికండీ ప్రయాణం ?''

''అడిగేవు ? కాశీపోతున్నా ! అమ్మ అస్తికలు గంగలో కలిపేసి వస్తా !''

''అంత దూరం ఎందుకండీ ? మన వైనతేయంలో కలపకూడదూ ? అంత డబ్బెక్కడిదీ మనకి ?''

''నువ్వేం అడ్డుచెప్పకు ! డబ్బుకి లోటేం లేదు ! పి. ఎఫ్. లోను పెట్టాను. కాపరా[illegible] వస్తూనే 'కాశీయో' అంటూ అడుగు పెట్టిందిట ఆవిడ ఈ యింట్లో ! నాన్న చెప్తూండేవారు ! డబ్బుకోసం ఆలోచించి, గంగలో కలపాల్సిన అస్తికలు గోదాట్లో కలుపుతానా ?!''

అంటూ నడుం పట్టుకుని నిలబడిపోయాడు వెంకటప్పయ్య. ★